

నార్సింగిలో కొత్త బస్సును ప్రారంభించిన వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్

ఆర్టీసీని ఆదరించాలి

మణికొండ: ప్రజల వద్దకే ఆర్టీసీ వారు అన్ని రూట్లలో బస్సులను నడుపుతున్నారని, వాటిని ప్రతిఒక్కరూ ఆదరించాలని నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ అన్నారు. గురువారం మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి నార్సింగి వరకు 221 నెంబరుతో ఏర్పాటు చేసిన బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర శివార్లలో అన్ని రూట్లలో అడిగిన వెంటనే బస్సులను నడుపుతున్నారన్నారు. వాటిల్లో రద్దీ పెరిగితే రాబోయే రోజుల్లో మరిన్ని బస్సులను ఏర్పాటు చేస్తారన్నారు. హెచ్‌సీయూ డిపో మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు చొప్పున నేటి నుంచి నడుపుతున్నామన్నారు. నార్సింగి నుంచి ఉదయం మొదటి బస్సు 7.20 గంటలకు, చివరి బస్సు 8.25గంటలకు ఉంటాయని, మియాపూర్ నుంచి ఉదయం 6.25 గంటలకు రాత్రి 7.30 గంటలకు చివరి బస్సు ఉంటుందన్నారు.

సంస్కార సాధన వర్గ శిక్షణ కార్యక్రమం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శారదాధామంలో సంస్కార సాధన వర్గ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యా భారతీ దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి అయాచితుల లక్ష్మణ్‌రావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు ఉత్తమ సంస్కారాలు చిన్ననాటి నుంచే నేర్పించాలన్నారు. విద్యకు ఏది ఆధారమై ఉండాలన్న అంశం ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. అందుకే విద్యతో పాటు సంస్కారాన్ని జోడించడం కూడా అవసరమేనన్నారు. చిన్నారి బాల బాలికలు పెరిగి పెద్దవారైనా తరువాత తమ భావి జీవితంలో ధర్మబద్ధ జీవనులుగా, సంస్కృతి నిష్ఠగల వారీగా, జాతీయత, సంప్రదాయాల పట్ల నిష్ఠ జీవించేలా చేయాలన్నారు. శారీరక వికాసం కోసం వ్యాయామం, క్రీడలు, ప్రాణిక వికాసానికి యోగా శిక్షణ, మనస్సును వికసింపచేయడానికి సంగీతం, సంపూర్ణ సమగ్ర వికాసానికి వ్యక్తిత్వం వికాసం రూపుదిద్దుకునే విధంగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రతి సంవత్సరం సంస్కార సాధనా వర్గ నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర స్థాయిలో 350 మంది బాలబాలికలు సంస్కార సాధనా వర్గ శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు పరమానంద బన్సల్, ప్రాంత సంఘటనా కార్యదర్శి తపకమూరి శ్రీనివాసరావు, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి విరివింటి రవీంద్రశర్మ, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



యువకుడి దారుణ హత్య



సురేశ్ మృతదేహం

జవహర్‌నగర్: టవల్‌తో గొంతుకు బిగించి, రాయితో తల పగులగొట్టి ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కౌకూర్‌కు చెందిన రాగం నాగేందర్ రావు ఇంట్లో ఈ నెల 1న నెల్లూరుకు చెందిన పొదలకూరు సురేశ్ (40) అద్దెకు దిగాడు. సమీపంలోని జనప్రియలో పెయింటర్‌గా పనిచేస్తున్న సురేశ్ రాత్రి వేళల్లో స్నేహితులతో కలిసి మద్యం తాగి న్యూసెన్స్ చేస్తుండటంతో బుధవారం అతడిని ఖాళీ చేయించి అడ్వాన్స్‌గా చెల్లించిన రూ. 1500 తిరిగి ఇచ్చేశారు. కాగా గురువారం ఉదయం స్థానిక హనుమాన్ దేవాలయం సమీపంలో దేవేందర్‌రెడ్డికి చెందిన పాడుబడిన ఇంటి వద్ద సురేశ్ మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సీతారాం సంఘటనా స్థలాన్ని పరిశీలించాడు. టవల్‌తో గొంతుకు బిగించి, ముఖంపై రాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులోనే హత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితులను త్వరలో పట్టుకుంటామన్నారు.



క్లీన్‌బౌల్డ్ పేరుతో క్రికెట్ బెట్టింగ్

- నలుగురు ముఠా సభ్యుల అరెస్ట్
- పరారీలో ప్రధాన నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ జానకి రెడ్డి

చైతన్యపురి: సులువుగా డబ్బులు సంపాదించేందుకు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జానకిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బి.హేమంత్ అనే వ్యక్తి క్లీన్‌బౌల్డ్ పేరుతో క్రికెట్ బెటింగ్ కోసం వాట్సాప్ గ్రూప్ సృష్టించాడు. సరూర్‌నగర్ జనప్రియ అపార్టుమెంట్‌కు చెందిన సూరోలు కృష్ణ, లింగోజిగూడ కామేశ్వర్‌రావు కాలనీకి చెందిన గొడుగు ఈశ్వర్‌కుమార్, అదే కాలనీకి చెందిన కసపాకల మహేష్, రమణబోయిన వంశీ హేమంత్‌తో పంటర్లుగా ఒక ముఠాగా ఏర్పడి క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా నగరానికి చెందిన పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. బుధవారం మొహాలీలో జరిగిన ముంబై వర్సెస్ పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌కు బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు కామేశ్వరావు కాలనీలోని ఓం సాయి లక్ష్మి డిజిటల్స్ ప్రింటర్స్ అండ్ అవుట్‌డోర్ కార్యాలయంపై దాడి చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 5 వేల నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు హేమంత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు



జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును పరిశీలిస్తున్న స్థానికులు

రాజేంద్రనగర్: గగన్‌పహాడ్‌లో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 25లో గల 2,600 గజాల స్థలంలో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేశారు. గగన్‌పహాడ్‌కు చెందిన నాయకుడు తలారీ శ్రీరాములు ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ జగన్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సత్యనారాయణ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలం కబ్జాకు గురవుతుందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు ఎన్నోసార్లు వినతిపత్రాలు అందజేశామన్నారు. స్థలాన్ని కాపాడాలని, ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో కబ్జాదారులు ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి స్థలానికి ప్రహరీ నిర్మించి దళితుల కోసం కమ్యూనిటీహాల్ భవనం నిర్మించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తలారీ శ్రీరాములు, ధనుంజయ్, తలారీ రాజ్‌కుమార్, తలారీ ఈశ్వరయ్య, సందయ్య, బి.గణేష్, జై, కిరణ్, టి.దయాకర్, శ్రీను తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ను సాగనంపితేనే మంచిరోజులు



హాత్‌సే హాత్ జోడో యాత్రలో పీసీసీ కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు

శంషాబాద్: బీఆర్‌ఎస్‌ను సాగనంపితేనే ప్రజలకు మంచి రోజులు వస్తాయని పీసీసీ కార్యదర్శి బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 19వ వార్డు యాదవబస్తీలో హాత్ సే హాత్ జోడో యాత్రను నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ పాలనపై విమర్శలు చేశారు. బీఆర్‌ఎస్‌తో నిరుద్యోగులు, రైతులు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాధించి తెచ్చుకున్న తెలంగాణలో సరైన ఉద్యోగాలు లేక విద్యావంతులులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, మండల అధ్యక్షుడు శేఖర్, బొబ్బిలి కిష్టయ్య, శ్రీధర్ యాదవ్, బొబ్బిలి శేఖర్, మిట్టు, నజీరుద్దీన్, జగన్, జహంగీర్, చందు పాల్గొన్నారు.



గండిపేటలో ఘనంగా బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

మణికొండ: గండిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు గురువారం అమ్మవారికి, బొడ్రాయికి బోనాల ఉత్సవాలను నిర్వహించారు. గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులను చల్లగా చూడాలని కోరుకున్నారు. స్థానిక కౌన్సిలర్‌లు గోపాల సునీత గణేష్, విజిత ప్రశాంత్ యాదవ్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేసినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య

సైదాబాద్: భర్త వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సైదాబాద్ పీఎస్ పరధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింగరేణి కాలనీకి చెందిన సాలేహ్‌కు కిషన్‌బాగ్‌కు చెందిన బుష్రాబేగం (26) తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. సాలేహ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా బుష్రాబేగం ఇంట్లోనే ఉంటుంది. గత కొద్ది రోజులుగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్త వేధింపులు తీవ్రం కావడంతో మనస్తాపానికి లోనైన బుష్రా గురువారం సాయంత్రం సింగరేణి కాలనీలోని తమ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీ పెట్టినందుకు కేసు

మణికొండ: తమ హోటల్‌పై గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని ఓ వ్యక్తి నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నార్సింగిలోని అన్సారీ హోటల్‌పై బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఉదయం వచ్చి చూడగా అభ్యంతకర ఫ్లెక్సీ ఉండటంతో సూపర్ వైజర్ ఎస్. ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.









పేదల సంక్షేమం కాంగ్రెస్‌కే సాధ్యం


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

మణికొండ: రాష్ట్రంలో, దేశంలో పేదల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్ సారథ్యంలో వందలాది మంది వడ్డెరలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇంటి స్థలాలు, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, రైతులకు రుణ మాఫీ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ..రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సమర్థుడైన నాయకుడు లేక వెనకబడి పోతుందని ఆరోపించారు. శంషాబాద్ కేంద్రంగా 35 ఎకరాల ప్రభుత్వ భూములు ఎమ్మెల్యే అనుచరులు కబ్జాలకు పాల్పడితే కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసి ప్రభుత్వ పరం చేసిందన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎన్ని ఇళ్ల పట్టాలు ఇచ్చారు, ఎన్ని డబుల్ బెడ్‌రూంలు ఇచ్చారనే విషయంపై ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు దమ్ముంటే చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వడ్డెరలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు తామంతా కాంగ్రెస్ పక్షాన నిలుస్తామన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో వడ్డెరులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 కోట్ల నిధులు, ఫెడరేషన్ ఇచ్చారని, ఇక్కడ రూ. 30లక్షలు ఇస్తానని ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, నాయకులు కిరణ్‌కుమార్, రాజు, లక్ష్మీనారాయణ, తాజుద్దీన్, పద్మారావు, పురుషోత్తం, కస్తూరి యాదయ్య, మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు.

అన్నదానం


ధర్మసాయి మందిరంలో భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శంషాబాద్: పట్టణంలోని ధర్మసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా పల్లకీ సేవ, హారతి కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనరసింహ కల్యాణం కూడా నిర్వహించి సత్యనారాయణ వ్రతాలు జరిపారు. నిత్యాన్నద మండపంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. ఆలయ ట్రస్టీ శివదత్తసాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్: 'అప్పులు అధికంగా అయ్యాయి.. ఇక నేను ఉండలేను.. ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నా. నన్ను క్షమించండి' అంటూ ఓ యువకుడు తోటి స్నేహితులకు వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాఫి కాలనీకి చెందిన షాహీద్‌ఖాన్(38) కూలీ పని చేస్తూ తన భార్య, ఇద్దరు సంతానాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా తాగుడుకు బానిసైయ్యాడు. దీంతో భార్య తన పిల్లలను తీసుకోని 15 రోజుల క్రితం అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. బుధవారం అర్ధరాత్రి 3 గంటల ప్రాంతంలో తన స్నేహితులైన సత్తర్‌ఖాన్‌తో పాటు మరో ఇద్దరికి వీడియో కాల్ చేస్తూ తాను ఇక బతకలేనని చనిపోతున్నానని తెలుపుతూ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. వెంటనే సత్తర్‌ఖాన్ షాహీద్‌ఖాన్ కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి సెంట్రింగ్ కార్మికుడి మృతి

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు ఓ సెంట్రింగ్ కార్మికుడు రెండో అంతస్తు నుంచి పడి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ కమాన్ ప్రాంతంలో కొత్తగా భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణ పనులను సెంట్రింగ్ కాంట్రాక్టర్ లక్ష్మయ్యకు అప్పగించారు. గురువారం పనులు చేసేందుకు ఒరిస్సాకు చెందిన రాజేంద్ర(28) వచ్చాడు. రెండో అంతస్తులో పనులు చేస్తుండగా గురువారం ఉదయం ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

రాజేంద్రనగర్: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి స్నేహితులను రప్పించి గ్యాబ్లింగ్ ఆడుతున్న ప్రధాన నిందితుడితో పాటు 20 మందిని రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7.50 లక్షల నగదు, 21 సెల్‌ఫోన్లు, పది ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మహ్మద్ ఖాదీర్ సులేమాన్‌నగర్‌లో కొత్తగా నాలుగు నెలల క్రితం భవనాన్ని కొనుగోలు చేశాడు. ఈ భవనంలో ప్రతి వారం, పది రోజులు, నెల రోజుల చొప్పున జూదాన్ని నిర్వహిస్తున్నాడు. తనకు పరిచయం ఉన్న నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్నేహితులను రప్పించి జూద్దాన్ని నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి సులేమాన్‌నగర్‌లోని కొత్తగా కొనుగోలు చేసిన నివాసంలో జూదాన్ని నిర్వహిస్తున్నాడు. స్థానికులు విషయాన్ని ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి 10 గంటల సమయంలో ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసి మహ్మద్ ఖాదీర్‌తో పాటు 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.7.50 లక్షల నగదుతో పాటు 21 సెల్‌ఫోన్లు, పది సెట్‌ల ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు.

అమెరికా బయలుదేరిన ఎంపీ రంజిత్‌రెడ్డి



శంషాబాద్: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ సభ్యుడు రంజిత్ రెడ్డి, సీతారెడ్డి దంపతులు గురువారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి అమెరికా బయలుదేరి వెళ్లారు. కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని దగ్గరుండి చూసేందుకు వెళ్లినట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎవైనా అత్యవసర పనులు ఉంటే తన కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు. మరో 15 రోజుల్లో అమెరికా నుంచి తిరిగి రానున్నట్లు తెలిపారు.



















